


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**84**

**(7' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"మనసిచ్చినవాడే** నా ప్రియుడు" - అని ఒక నాయిక ఎంతో ధీమాగా చెప్పుకుంది. ప్రియుడనేవాడు ఏమి ఇచ్చినా, ఇయ్యకపోయినా కనీసం మనసైనా ఇస్తే కొంత మెచ్చుకునే అవకాశం ఉంటుంది. మనస్సు అనేది మహత్తరమైన సంపద అంటారు. కనుక దానితో తృప్తిపడవచ్చు.

"నచ్చినవాడే నా ప్రియుడు" అనే మరో నాయిక తన స్వాతంత్ర్యభావాన్ని వెలిబుచ్చుకుంది. మరి ఇక్కడ "నచ్చడ"మనేమాటకు ఆవిడగారి వ్యాఖ్యానమేమో తెలియదు. అవతలవాడి మనస్సుతో సంబంధంలేదని మాత్రం అర్థమవుతుంది.

***నచ్చడమంటే చూపులో, మాటలో!***

నచ్చడమంటే కంటికి నచ్చడమో ఏమో మరి, ఒకప్పుడు అవతలవాడి తుంటరితనం నచ్చవచ్చు. మన జానపదాలలో కొంటితనాన్ని చూచి గుండెలు గుమ్మరించిన నాయికల గాథలు కొన్ని ఉన్నాయి. ఈ రోజుల్లో కొంటితనానికి ఏం తక్కువవుంది? అంతా కొంటిమాయలే!

చూపులే కొంటిచూపులు. నడకలే కొంటి నడకలు. వలపులే కొంటి వలపులు. రూపాలే చాలావరకు కొంటె రూపాలు. మాటలు సరేసరి.

ఇలాటి వారంతా నిజానికి నవ్యపథంలో విహరించే నలకూబరులుగా ప్రత్యక్షమవుతున్నారు. ప్రత్యేకతలంటూ ఏమీ ఉండవు. అంతా ఒకటేపాట. ఆరాధన అంటూ ఏమీ వుండదు. ఒకేరకపు వేట.

పైన చెప్పిన నాయికకు నచ్చినవాడంటే ఇలాంటి కొంటెదొర కావచ్చు. అలాటి పరిస్థితిలో ఆమెకు లభించే ప్రియుడు మామూలు ప్రేమదినుసులు - హృదయం, త్యాగం, ఆరాధన, స్పందన, మొదలైన వాటిని మూటగట్టుకు రావలసిన అవసరం ఉండదు.

తన భాగ్యమంతా ఎదుటివాళ్ళ కళ్ళల్లో ఉన్నప్పుడు అతగాడు పాతకాలపు ముళ్ళకంచెల్లోపడి నడిచిరావడమెందుకు? రాజమార్గంలోనే నడుస్తాడు. రావలసిన ఆహ్వానం వస్తుంది. కావలసిన భోగం దానంతటదే అందుతుంది.

***జుట్టుచూసి ప్రేమ. పడికట్టు మాటలు చూసి ప్రేమ***

ఇలాటి వలపులను గురించి ప్రస్తావిస్తూ ఒకాయన అన్నాడు. "ఏం ప్రణయాలు? అ ధ్వానపు ప్రణయాలు. హృదయాల సంగతి అక్కరలేదు. ఉత్సుకత విషయం అంతకన్న అక్కరలేదు. జుట్టుచూసి ప్రేమ, కట్టుచూసి ప్రేమ, పడికట్టు మాటలు చూసి ప్రేమ. వీటితోనే సరిపెట్టుకుంటున్నప్పుడు ఇంకా సాధించవలసిందేం వుంది? "

"వాళ్ళు సాధించవలసిందేం లేదు. కాకపోతే 'నచ్చిన పురుషుడు' అని సంబరాలుపడే బింబాధరుల మానసికతత్వాన్ని పరిశోధించవలసిందేగాని" అని మరో ఆయన అన్నారు.

ఒకళ్ళకు నచ్చిన విషయాన్ని గురించి మరొకరు పరిశోధించవలసినది ఏం వుంటుంది ఎందుకు నచ్చాడంటే వాళ్ళుమాత్రం చెప్పగలరా! అసలు ఆ ప్రశ్నకు వారు గుక్కతిప్పుకోగలరా?

ఈ నచ్చడమనేది చాలా విచిత్రమైన విషయం. అది 'పర్సనల్' నిర్ణయం. మరొకరు విచారించడానికి అవకాశంలేదు.

"అదేమిటయ్యా! ఆ వేషం వేశావు. నీకేం బాగుంది? వెనుకటి వేషంలోనే నువ్వు బాగుండేవాడివి" అంటే వెంటనే

"మీ సంగతి నాకెందుకు? నాకు నచ్చింది. నేను తీసుకున్నాను" అంటాడు గర్వంతో. అడిగేవాళ్ళకు పిచ్చికాకపోతే ఒకరికి నచ్చిన విషయాన్ని గురించి సంశయం ప్రకటించడమేమిటి?

***రోహిణి ఎండల్లో రగ్గు కప్పినట్లు***

అక్కరలేని సలహాలు చెపితే అవతల వాళ్ళకెలా ఉంటుంది? భగ్గున మండే రోహిణీకార్తి ఎండల్లో మిట్టమధ్యాహ్నం వేళ ఒక పెద్ద రగ్గు తీసుకెళ్ళి కప్పినట్లుంటుంది.

ఆ మధ్య ఒకరి యింటికి వెళ్ళాను సాయంత్రంపూట. వరండాలో కూర్చుని ఆ యింటి యజమానితో మాట్లాడుతున్నాను. ప్రక్కభాగంలో దంపతులు ముస్తాబై బయటికి వచ్చారు. ఇంటికి తాళం పెట్టారు. చెరో తాళం చెవి తీసుకొచ్చారు. భర్త అన్నాడు "సరే! నీకు నచ్చిన సినిమాకు నువ్వుపో! నాకు నచ్చిన దానికి నేనుపోతా. పదిగంటలకు వచ్చి కలుసుకుందాం" అని.

"పదిగంటలకు వచ్చి కలుసుకుందాం" అన్న మాటలో కొంచెం స్థాయీ భావం ఉంది. ఆయనగారు ఆ మాత్రం మాట్లాడటంలో కొంత దాంపత్యగౌరవం ఇమిడివుంది. బయటకురాగానే కొంత స్వేచ్ఛ ఉండాలనే సత్యాన్ని వారు గ్రహించారు. స్వేచ్ఛలోనే దాగివుంటుంది. ఇచ్ఛ. ఆ ఇచ్ఛకే పర్యాయపదం నచ్చడం.

***భర్తకు నచ్చిన చీర! భార్యకు నచ్చిందా?***

ఒకసారి పెళ్ళిలో పదిమంది ఆడవాళ్ళు ఒకచోట సమావేశమయ్యారు. వారారోజున చర్చించిన విషయం - స్త్రీ తనకు నచ్చిన దుస్తులు ధరించినప్పుడు భర్త చూసి గర్వపడాలా! అన్నది.

చాలాసేపు చర్చ జరిగింది. స్త్రీ తనకు నచ్చే విధంగానే అలంకరించుకోవాలన్న వారి సంఖ్య పెరిగింది. ఆ తీర్పు సమయంలో వోటువేస్తూ చేతులెత్తిన వారందరికీ గోల్డుస్పాట్‌లు బహూకరించబడ్డాయి.

'నచ్చినవాడు' - నిజానికి అంతగొప్పవాడుగా ఉండక్కర్లా. తనకు నచ్చని వాడితో పోటీపెట్టడానికి ఎట్లాంటి నకిలీ సరుకైనా సరిపోయింది. ఆ సరుకుకే ఎంతో ప్రతిష్ఠ కల్పించాలనే ఆకాంక్ష బయలుదేరుతుంది.

***మెచ్చుకుని మెడలో వేసే పొగడ దండలు***

కొందరికి కేవలం తనను మెచ్చుకునే వాళ్ళే నచ్చుతారు. మెచ్చి మెడలో వేసే పొగడ్తల పేరిట పొగడ దండలు విచ్చి సువాసనలు వెదజల్లుతుంటే ఆ వ్యక్తి నచ్చక ఏం చేస్తాడు?

మా మేనత్త పాపం అల్పసంతోషి, అమితభాషి. ఒక్కొక్కరోజున మధ్యాహ్నంపూట భోజనాలవగానే - ఆ ఎండలోనే ఆయాసపడుతూ మా యింటికి వచ్చేది. "ఏమిటి అత్తయ్యా ఇంత హడావుడిగా పరుగెత్తుకువచ్చావు?" అంటే

***ఇవ్వాళ మామయ్యకు పచ్చడి నచ్చిందిరా.***

"వచ్చానర్రా. నాకు ఇంట్లో ఉండబుద్దిపుట్టలేదు. ఇవ్వాళ మీమామయ్య పచ్చడి తనకెంతో నచ్చిందని ఎంతో మెచ్చుకున్నారు. అంతకంటే నాకింకేం కావాలి చెప్పండి. భర్తకు నచ్చే సేవలు చేయడంలో ఉన్న ఆనందం మరోదాంట్లో ఉంటుందా?

నా మనస్సుకి ఇవ్వాళ పండగలాగా ఉంది. అందుకని మిగిలిన పచ్చడి పుచ్చుకుని చక్కావచ్చ మీకూ రుచి చూపిద్దామని, హాయిగా తినండి" అని పచ్చడిగిన్నె అక్కడపెట్టి పరమానందభరితురాలయ్యేది.

"ఆయనగారికి నచ్చిన పచ్చడి ఇక్కడికి తెచ్చావేంటి? పైగా ఇంత సంతోషంగా ఉన్నప్పుడు ఇలా వచ్చేశావేమిటి? నచ్చడమంటే ఏమిటి? మనసు విచ్చడమేగా?" అని మా పెద్దమ్మ అనేది.

***నచ్చడం రత్నాలు పొదిగిన రంగుల పచ్చడం.***

"ఏమో? అదంతా నాకు తెలియదు. ఆ మాట మీ చెవిని వెయ్యాలనిపించింది. వచ్చేశాను. కావాలంటే రేపు మరింత పచ్చడి చేస్తాను. మనుష్యులు నచ్చకపోయినా ఒకప్పుడు వారి చేష్టలు నచ్చుతాయి. అదేం సాధ్యమో" అని ఆవిడ తన ఆవేదనతో కూడిన ఆనందాన్ని తెలియపరిచేది.

'నచ్చడం' అనేది ఒక్కొక్క సమయంలో రత్నాలు పొదిగిన రంగుల నచ్చడంలాగా కనిపిస్తూంది మురిపిస్తుంది.

Post your comments